కమ్ముకున్న కంప చెట్లు

- ప్రమాదకరంగా చెరువులు, కుంటల కట్టలు
- కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితి
- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం



పాత చెరువు కట్టపై కమ్ముకున్న కంప చెట్లు

లింగాలఘణపురం: మండలంలోని చెరువులు, కుంట కట్టలన్నీ కంప చెట్లమయమై ప్రమాదకరంగా మారాయి. ఎన్నో ఏళ్ల తరబడి కనీస మరమత్తులకు నోచుకోకపోవడంతో కట్టలపై కాలినడక కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 56 చెరువులు, కుంటలు ఉన్నాయి. లింగాలఘణపురం, క్లోం, సిరిపురం, జీడికల్, మాణిక్యాపురం, నాగారం, బండ్లగూడెం,నెల్లుట్ల, పటేల్‌గూడెం గ్రామాల పరిధిలో 26 చెరువులు, కుంటలు ఉండగా అందులో 14 కట్టలపై కంప చెట్లు భారీగా ఉన్నాయి. అదేవిధంగా నవాబుపేట, వడిచర్ల, వనపర్తి, కొత్తపల్లి, నేలపోగుల, చీటూరు, కుందారం, కిష్టగూడెం గ్రామాల పరిధిలో 30 చెరువులు, కుంటలు ఉండగా అందులో పది కట్టలపై కంప చెట్లతో నిండిపోయాయి. మిషన్ కాకతీయ పథకంలో చేపట్టిన పనులే తప్ప ఇప్పటి వరకు చెరువులతో పాటు, కట్టలను కూడా పట్టించుకోలేదు. దీంతో సగానికి పైగా చెరువులు, కుంటలు కంప చెట్లతో నిండి ఉన్నాయి. కట్టలపై ఏమైన లీకేజీలు జరిగితే కూడా కనిపించలేని పరిస్థితుల్లో ఉన్నాయి. వ్యవసాయ బావుల వద్దకు చెరువు కట్టలపై వెళ్లే రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చెరువు కట్టలపై ఉన్న తాటి, ఈత చెట్లు ఎక్కే గీత కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులైన, ఉపాధి హామీ పథకంలోనైన చెట్లను తొలగించి కట్టల మరమత్తులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



మండల కేంద్రంలోని పాత చెరువు కట్టపై కాలి నడకన కూడా వెళ్లకుండా కంప చెట్లు పెరిగాయి. ఎన్నోసార్లు అధికారులకు చెప్పాం. ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇటీవల గ్రామ సభలో కూడా దృష్టికి తీసుకెళ్లాం.

-బోయిని మైసయ్య, రైతు, లింగాలఘణపురం

ప్రతిపాదనలు పంపాం



మండలంలోని చాలా చెరువులు, కుంట కట్టలపై కంప చెట్లతో నిండిపోయిన మాట వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారుల సూచనల మేరకు ముళ్లచెట్ల తొలగింపుకు ఉపాధి హామీ పథకంలో ప్రతిపాదనలు పంపించాం. మండలంలోని ఇద్దరు ఏఈల పరిధిలో సుమారు 24 చెరువులు, కుంట కట్టలపై కంప చెట్ల తొలగింపుకు ప్రతిపాదనలు చేశాం.

- లక్ష్మణ్, ఏఈ, నీటిపారుదల శాఖ

క్లుప్తంగా

తాత్కాలిక పోస్టుల భర్తీకి ఆహ్వానం

నర్మెట: మండలకేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు తాత్కాలిక ప్రాతిపాదికన (హెచ్‌బీటీ) భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ కెమిస్ట్రీ, బాటనీలకు బీఈడీ తత్సమాన ట్రైనింగ్‌తో సంబంధిత సబ్జెక్టుల్లో ఎమ్మెస్సీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. టీజీటీ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ బోధనకు డిగ్రీతో బీఎడ్ /టీపీటీ సబ్జెక్టుల్లో మెథడాలజీ కలిగి ఉన్నవారు ఈనెల 30న 3 గంటలలోగా నేరుగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 96769 59203 సంప్రదించాలని ఆమె తెలిపారు.

బియ్యం అందజేత



పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన గాయాల బుచ్చయ్య అనారోగ్యతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు ఎడవెల్లి సోమమల్లయ్య 50 కేజీల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గద్దల యాకసోమయ్య, ఎడవెల్లి సుభాష్, వెంకటేశ్వర్లు, సునీల్ మహాజన్, సతేంద్ర సంపత్, మామిండ్ల యాకన్న, పసులాది ప్రశాంత్ పాల్గొన్నారు.

'ఎస్సీల వర్గీకరణ మాదిగల జన్మహక్కు'

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీల వర్గీకరణ మాదిగల జన్మహక్కు అని, రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ లేకుండానే ఉద్యోగ నియామకాలు చేపట్టడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. మండలంలోని రంగరాయగూడెంలో ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నూతన గ్రామ కమిటీలను బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నాయకులు మంద శ్రీనివాస్, పైసా రాజశేఖర్, గద్దల కిషోర్, రవీందర్, మహేష్, ఉదయ్, శ్రీధర్, భాస్కర్, కల్యాణ్, రమణాకర్, వంశీ, రాజు పాల్గొన్నారు.

హిందూ చైతన్య రథయాత్ర

బచ్చన్నపేట: మండల కేంద్రంలో హిందూ చైతన్య రథయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల భజనలు, కోలాటాలు, ఒగ్గుడోలు కళాకారుల నృత్యాల నడుమ వీధుల్లో రథయాత్రను తిప్పారు. భక్తులు మంగళహారతులతో నిరాజనం పలికారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత చలితీవ్రత దృష్ట్యా మండలంలోని తాటికొండ గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది వృద్ధులకు బుధవారం ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంని, దాంతో వృద్ధుల సంక్షేమం కోసం తమవంతుగా దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చలితో పాటు శ్వాసకోశ వ్యాధులపై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కుంబోజు గౌరేష్, బలిజ రాజు, పాలకుర్తి నాగరాజు, పులి రవి, దామెర శ్రీనివాస్, బొల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

జనగామ రూరల్ : అటెండర్ లేకుండా, నిబంధనలకు మించి విద్యార్థులను స్కూల్ బస్సులో తీసుకెళ్తున్న దేవరుప్పుల బాలయేసు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏఓ మన్సూర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, ఉపాధ్యక్షుడు దాసగాని సుమ, జిల్లా సహాయ కార్యదర్శి యాకన్నరాథోడ్, నాయకులు సౌజన్య ఆర్య, శ్రీనాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాజాతా

చిల్పూరు: ప్రజలను మంచి విషయాల్లో జాగృతం చేయడమే పోలీస్ కళాజాతా ఉద్దేశమని చిల్పూరు ఏఎస్సై జయకుమార్ అన్నారు. మండలంలోని నష్కల్ గ్రామంలో బుధవారం రాత్రి కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నాగమణి, హెచ్‌సీ విలీయమ్స్, మెజీషియన్ నారాయణ, వెంకన్న, రత్నయ్య, శ్రీనివాస్, విక్రం, చిరంజీవి, మాజీ సర్పంచ్ కర్ణకరంటి స్వప్నవెంకటేష్, మాజీ ఎంపీటీసీ పాశం శిరీష సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని తిరుమలనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాల్లో భాగంగా చివరిరోజు బుధవారం ఘనంగా పూజలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు కలకోట రామానుజచార్యులు, ధర్మకర్త రంగాచార్యులు, అర్చకులు నరేశ్, వరుణ్ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. 108 కలశాలతో అభిషేకం పూజ, మహాపూర్ణాహుతి, ఆలయ శుద్ధి, పండితులకు సన్మానం తదితర కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టగా ఘన్‌పూర్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమంలో భక్తులు కొలిపాక సతీష్, సునీత, రాజు, కుంభం నరేందర్, హేమలత, యాద శ్రీనివాస్, గన్ను సునీత, శ్రీనివాస్, కుంభం మధు, గోపి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- యూటీఎఫ్ కేజీబీవీ జిల్లా కన్వీనర్ చైతన్య



నిరసన తెలుపుతున్న కేజీబీవీ ఉద్యోగులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ కేజీబీవీ జిల్లా కన్వీనర్ చైతన్య అన్నారు. మండలంలోని నమిలిగొండ శివారులో ఉన్న కేజీబీవీలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. కేజీబీవీ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కేజీబీవీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి .రజిత, సుధ, మానస, సుకన్య, శోభారాణి, శ్రీదేవి, విజయ, కృష్ణవేణి, నిర్మల, యాకలక్ష్మీ, అనీత, పద్మ, శ్రీలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



రఘునాథపల్లి: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్



చిల్పూరు: మాట్లాడుతున్న ఏఓ నజీరుద్దీన్

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

రఘునాథపల్లి: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలిగించొద్దని నిర్వాహకులకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్ సూచించారు. మండలంలోని ఖిలాషాపూర్, వెల్ది, అశ్వరావుపల్లి గ్రామాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, మహిళా రైతులకు ప్రత్యేక సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తూకం వేసిన ధాన్యం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు లారీల్లో లోడ్ చేసి మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోసిన్ ఉన్నారు.

ధాన్యం నిల్వ లేకుండా చూడాలి

చిల్పూరు: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడూ తరలించాలని మండల వ్యవసాయాధికారి నజీరుద్దీన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు వినయ్‌కుమార్, నర్సింహులు, యాకూబ్ ఉన్నారు.

నియామకం



తరిగొప్పుల: కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన కల్వ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బుధవారం రాజుకు అందజేశారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, యాదగిరి, చంద్రయ్య, పోషయ్య, యాకూబ్, నవీన్, అరుణ్‌రెడి ఉన్నారు.

ఎన్నిక



సత్యనారాయణ

దేవరుప్పుల: గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) మండల అధ్యక్షుడుగా గొల్లపల్లికి చెందిన తీగల సత్యనారాయణ ఎన్నికైనట్టు ఎన్నికల పరిశీలకుడు అంబటి అంజయ్య తెలిపారు. బుధవారం గోపా జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా చీకటి ఎల్లేష్, మేకపోతుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బస్వ వెంకన్న, కోశాధికారిగా ఓడపల్లి కొమురయ్య, కార్యదర్శులుగా తీగల యాదగిరి, బత్తిని భరత్, గౌరవ సలహాదారులుగా ఓడపల్లి రవీందర్ ఎన్నుకున్నట్లు వివరించారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కృషి



అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఆరోగ్య పరిరణక్ష కోసం కామినేని ఆస్పత్రి తోడ్పాటు అందిస్తుందని పీఆర్ఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో కామినేని హాస్పిటల్ డెంటల్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతలో దంతాల సంరక్షణ కీలకమన్నారు. దంత పరిరక్షణ కోసం పాటించాల్సిన పలు జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అంబటి అంజయ్య, పంచాయతీ కార్యదర్శి మధుకర్, పీఆర్ఓ చంద్రశేఖర్, డాక్టర్ దీపిక, గీత, పూజ, కీర్తన, రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింహగర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్: డిసెంబర్‌లో తలపెట్టిన హలో మాల చలో హైదరాబాద్ సింహగర్జనను విజయవంతం చేయాలని బుధవారం జనగామ చౌరస్తాలో మాల కులస్తులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గద్ద సాయికుమార్, గోనిగంటి చంద్రశేఖర్. మార్క ప్రశాంత్, కునిగంటి నరేష్, యనమల మహేందర్, మద్దెల కార్తీక్, పల్లె హరీశ్ నర్సింగరావు, శివ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారానికి తరలిరావాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

రఘునాథపల్లి: నేడు(గురువారం) జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో గ్రంథాలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మారడోజు రాంబాబు ప్రమాణ స్వీకారానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ హాజరవుతున్నందున ప్రతి ఒక్కరూ వచ్చి దిగ్విజయం చేయాలని కోరారు. నామాల బుచ్చయ్య, వెంకట్‌రెడ్డి, రవి, బాస్కర్, వెంకటేష్, రంగురాజు, శ్రవణ్, రమేష్, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు సీసీఐ పత్తి కొనుగోళ్లు బంద్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సిరి కాటన్ ఇండస్ట్రీస్, శివసాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో పత్తి, పత్తి గింజల నిల్వలు పేరుకుపోవడంతో ఈనెల 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో ఆయా మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు బంద్ చేయనున్నట్లు మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ జిన్నింగ్ మిల్లు వారి కోరిక మేరకు ఈనెల 29న (శుక్రవారం), శనివారం 30న వారాంతపు సెలవు, డిసెంబర్ 1 ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని తెలిపారు. పైన తెలిపిన తేదీల్లో సీసీఐ కొనుగోళ్లు ఉండవని, రైతులు గమనించి సహకరించాలని వారు కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పాలకుర్తి: మండలంలోని గూడూరు సాంఘిక సంక్షేమ తెలంగాణ గిరిజన విద్యాలయ(బాలికల) విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నిస్, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేణుక రాథోడ్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జనగామలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన నవీన, నిఖిత, వెన్నెల, ఆరాధ్య, లక్ష్మీప్రసన్న, సాత్విక, శివాని, ఐశ్వర్య, వనీతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, పీఈటీ సుస్మిత, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: ఫిల్టర్ బెడ్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి.. నీటి వ్యాపారాన్ని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని చీటకోడూర్ రిజర్వాయర్ దగ్గరున్న ఫిల్టర్ బెడ్‌ను బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడారు. పట్టణంలో సుమారుగా లక్ష జనాభా ఉన్నా మున్సిపల్ యంత్రాంగం తాగునీరు అందించడంలో వైఫల్యం చెందిందని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైననీరు అందించాలని, లేకుంటే పెద్ద ఎత్తున మున్సిపాలిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, సభ్యులు ఎండీ అజారుద్దీన్, కళ్యాణం లింగం, బాల్నె వెంకట మల్లయ్య, పందిళ్ళ కళ్యాణి, పల్లెర్ల లలిత, చందు, అంజమ్మ, రామ్ మల్లయ్య మల్లేష్‌రాజ్, మహేందర్ పాల్గొన్నారు.

'ప్రజలకు సేవ చేసేందుకే వచ్చారు'



మాట్లాడుతున్న నాయకులు

పాలకుర్తి: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలు ప్రజలకు సేవ చేసేందుకు అమెరికా నుంచి వచ్చారని పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు. బుధవారం పాలకుర్తిలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 సంవత్సరాలుగా నియోజకవర్గాన్ని ఎంత అభివృద్ధి చేయాలో ప్రణాళికలు రూపొందించుకుని పనిచేస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, గాదెపాక బాస్కర్, రాజేశ్ నాయక్, కుమారస్వామి, లావుడ్య భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న విజయ్



కొడకండ్ల: మాట్లాడుతున్న రామోజీ



దేవరుప్పుల: మాట్లాడుతున్న సుందర్‌రామిరెడ్డి

- బీఆర్ఎస్ నాయకులు

రఘునాథపల్లి: ఈనెల 29వ తేదీన యశ్వంతపూర్ జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆదేశాను సారం శుక్రవారం ఏర్పాటు చేస్తున్న కార్యాక్రమానికి మండలంలో 4 క్లస్టర్లుగా విభజించి ఇన్‌చార్జ్‌లను నియమించడం జరిగిందన్నారు. మండలం నుంచి 300 మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. మండల ఇన్‌చార్జ్ మాజీ ఎంపీపీ ఎర్రోళ్ల కుమార్, ముక్కు పరుషరాములు, స్రుజన్‌కుమార్, రాజేందర్, హరీశ్, రంజన్ ఉన్నారు.

కొడకండ్ల: ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ కోరారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహర దీక్షను కేసీఆర్ చేపట్టిన రోజును దీక్ష దివస్‌గా నిర్వహిస్తున్నందున మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. రాము, జ్యోతి, వెంకటేశ్వర్‌రావు, అభిమన్ గాంధీ, విజయమ్మ, కృష్ణమూరి పాల్గొన్నారు.

దేవరుప్పుల: కేసీఆర్ పిలుపుమేరకు ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలో తలపెట్టిన దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వివిధ గ్రామాల ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్వమల్లేశం, చింతరవి, సోమయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప్పుగల్లు పశువైద్యాధికారి కాకుమాను శ్రీనాథ్, మండల పశువైద్యాధికారి సీహెచ్ రజిత మాట్లాడుతూ లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేస్తే ఆడ దూడలు మాత్రమే జన్మిస్తాయన్నారు. అనంతరం 66 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మంజుల, రాజేశ్వర్‌రావు, నగేశ్, లచ్చయ్య, రాజు, దివ్య,రైతులు పాల్గొన్నారు.

పించన్ లబ్ధిదారుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న పించన్ లబ్ధిదారులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఆసరా పింఛన్ కోసం రోజుల తరబడి తిరగాల్సి వస్తున్నది.. గడిచిన నాలుగు రోజులుగా గంటల తరబడి పడిగాపులు పడుతున్నామని వృద్ధులు, దివ్యాంగ లబ్ధిదారులు డివిజన్ కేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘన్‌పూర్‌లో 1,200 మందికి పైగా పింఛన్‌దారులున్నారని, గతంలో పట్టణంలో ఏరియాల వారీగా ఒక చోట ఒక వ్యక్తి పింఛన్ పంపిణీ చేసేదని, మంచానికే పరిమితమైన వారి ఇంటికి వెళ్లి అందజేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం పోస్టాఫీస్ అధికారులు మరో వ్యక్తితో పంపిణీ చేయిస్తున్నారని, అతను జీపీ కార్యాలయంలో సమయ పాలన లేకుండా పంపిణీ చేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా పాత పద్ధతితోనే పింఛన్ డబ్బులు ఇవ్వాలని కోరారు.